క్లుప్తంగా...

వెంటనే సమస్యను పరిష్కరిస్తాం



దీనదయాల్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ దీనదయాల్ నగర్‌లో గురువారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినాయక్‌నగర్ నుంచి దీనదయాల్‌కు వచ్చే వర్షపు నీరు వల్ల మూతలు తెరుచుకొని ఇళ్లలోకి నీరు ప్రవహిస్తోందని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఇంజినీరింగ్ సిబ్బందికి కనెక్టింగ్ వర్షపు నీటి కాలువను పూడిక తీసేలా ఆదేశించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: కాప్రా డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రతినిధులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి హాజరై అందరినీ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో సీసీ రోడ్డు పనులు



అశోక్‌మణిపురి కాలనీలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: అశోక్ మణిపురి కాలనీలో గురువారం స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కాలనీలో రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణంతో స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. డివిజన్‌లో సమస్యలు గుర్తిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు కార్పొరేటర్ స్వర్ణరాజ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ముంపు కాలనీల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణాలు



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎన్ కాలనీ సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద నిర్మాణంలో ఉన్న నాలా పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ముంపునకు గురవుతున్న కాలనీల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణాలు చేపడుతున్నామని, దీని వలన ముంపు సమస్య దాదాపు తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, కిషోర్, సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఘనాపూర్ ఫకీర్ టెక్యా, లింగాపూర్ తండాలో త్రీఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని, గ్రామంలో అవసరమైన 38 స్తంభాలు మంజూరు చేయాలని సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీలో ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్మన్ మాధవరెడ్డి విద్యుత్ అధికారులకు వినతి అందజేశారు. అలాగే పలువురు బిల్లుల హెచ్చు తగ్గింపుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి



హబ్సిగూడలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు



సమావేశంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: మీ కోసం – మీ ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు, యోగక్షేమాలు తెలుసుకుంటూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ముఖ్య లక్ష్యమన్నారు. అదేవిధంగా కాలనీవాసులు తెలిపిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం సాయిరాం స్కూల్‌లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అదేవిధంగా వెంకట్‌రెడ్డినగర్‌లో రూ.33 లక్షలతో నిర్మించే సీవరేజ్ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ప్రారంభ బ్రోచర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ రవీందర్, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, శ్రీనివాస్, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు బేతి స్వప్నరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ బీవీ.చారి, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సోమిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గిరిబాబు, ముత్యంరెడ్డి, వనంపల్లి గోపాల్‌రెడ్డి, నందికంటి శివ, శ్రీధర్, అక్బర్, లింగానాయక్, రవినాయక్, అబ్బూబాయ్, శ్రీకాంత్, యాకాంతరావు, హరీష్, వినీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

హబ్సిగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22 రోజులుగా తాను చేపట్టిన పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పనులను అధికారులకు తెలియజేస్తూ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత పనులు ప్రతిపాదనలను చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీవో ప్రసాద్‌రావు, డిప్యూటీ కమిషనర్లు ముకుందరెడ్డి, శ్రీనివాస్, ఈఈలు నాగేందర్, హరిలాల్, జలమండలి మేనేజర్ సంతోష్‌కుమార్, డీజీఎంలు సతీష్‌కుమార్, రజనీకాంత్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్లు శ్రీనివాస్, రమాదేవి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు వెంకటరమణ, గిరిరాజ్, ఏఎంహెచ్‌వో స్వప్నరెడ్డి, డీఈ చందన, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు



చర్చి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలో కలుషిత తాగునీటి సరఫరాను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించే విధంగా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆమె జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి చర్చి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి జల కాలుష్యం, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె స్థానికంగా తాగునీటి సరఫరాల్లో వస్తున్న కాలుష్యాన్ని గుర్తించే మిషన్‌ను తెప్పించి తాగునీటిని అధికారులతో కలిసి పరీక్ష చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా వెంట వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, జలమండలి అధికారులు ఆసిఫ్, రాజేశ్వర్‌రెడ్డి, చర్చి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి సుధాకర్, జ్ఞానపాల్‌రెడ్డి, సతీష్, మర్రి రెడ్డి, వినోద్, భాస్కర్, అలెగ్జాండర్, రాయన్న, సుమలత, ఉపేందర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం ఎన్నికల స్టంటే..



తుంగతుర్తి రవి

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం అమలులో భాగంగా మూడు రోజుల గడువు నిన్నటితో ముగియడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, మరో 30 రోజులు గడువు పెంచాలని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడిచినా పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇల్లు కలగానే మిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7,600 మంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే 1,226 మందిని అర్హులుగా ప్రకటించి, అందులో 320మందికే అలాట్‌మెంట్ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి



ఉప్పల్ పోస్ట్ కార్యాలయంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఉప్పల్: ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకోవాలని ఉప్పల్ పోస్ట్‌మాస్టర్ జి.రవిందర్ పిలుపునిచ్చారు. ఆజాదికా అమృత్ ఉత్సవాల్లో భాగంగా గురవారం ఉప్పల్ పోస్టల్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కావాల్సిన జాతీయ జెండాలు ఉప్పల్ పోస్ట్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ఒక్క జెండా ఖరీదు రూ.25 మాత్రమే అన్నారు. శ్రీనివాస్, రాజు నాయక్, శ్రీకాంత్, ఆంజనేయులు, నాగమణి, సునీత, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి గడువు పొడిగించాలి



వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: గృహలక్ష్మి పథకం గడువు పెంచాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్ఎంసీ యూజీడీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం చెప్పినా సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవడం లేదన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తీసుకున్నప్పటికీ కాలపరిమితి తక్కువగా ఉన్నందున్న చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని, గడువు పెంచడంతో పాటు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యభిచారం నిర్వాహకుల అరెస్టు

ఉప్పల్: ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను మసాజ్ పేరుతో తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతానికి చెందిన తేరటి మహేందర్(31)కి సెల్‌ఫోన్ రిపేర్ సెంటర్ ఉంది. కల్యూరి కేశవ(29)సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వీరిద్దరూ కలిసి మసాజ్ పేరిట ఇతర రాష్ట్రాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నారు. రామంతాపూర్ గోఖలేనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిపై దాడి చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ ఉపాధ్యక్షుడిగా పోరెడ్డి సత్యనారాయణ



పోరెడ్డి సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి సర్కిల్ బి–బ్లాక్ ఉపాధ్యక్షుడిగా వినాయక్‌నగర్ డివిజన్ శ్రీసాయినగర్‌కు చెందిన పోరెడ్డి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

కుషాయిగూడ: గిరిజనుల సాంప్రదాయ ఉత్సవం తీజ్ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌బీకాలనీ, కైలాసగిరి బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ సీనియర్ నేతలు బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా సాంప్రదాయ దుస్తులు ధరించి గిరిజన వేషధారణలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తమ కుటుంబ సభ్యులంతా సుఖంగా ఉండాలని కోరుకుంటూ అప్పుడే మొలకెత్తే వరినాట్లను నెత్తిన పెట్టుకొని దైవాన్ని కొలుచుకోవడం వారి సాంప్రదాయం. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, విద్యానాయక్, రాందాస్‌నాయక్, చంద్ర, నాను, లచ్చిరాం, లింగానాయక్‌తో పాటుగా స్థానిక నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, పోలేపాక అంజయ్య, లాజర్, మల్లికార్జున్, నవీన్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: అపరిష్కృతంగా విద్యారంగంలో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ధర్నా నిర్వహించింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు తమ సమస్యలపై ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా నిరసనలు, ఉద్యమాలు చేసినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ధర్నా అనంతరం డీఈఓ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మౌలాలి: డివిజన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్‌గూడ సంతోషిమాత దేవాలయం వద్ద రూ.60 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులను గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రతి కాలనీని అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎస్‌వీ సతీష్ కుమార్, అమీనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

కేంద్రం ఇచ్చే నిధులను దుర్వినియోగం చేస్తున్న రాష్ట్రం



రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌కు వివరిస్తున్న ప్రభాకర్

రామంతాపూర్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను ఢిల్లీలో గురువారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కలిసి వివిధ అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందనే విషయాన్ని వివరించారు. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక సంఘం ద్వారా అందిస్తున్న నిధుల్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పక్కదారి పట్టిస్తోందన్నారు. అదేవిధంగా ఆవాస్ యోజన, సడక్ యోజన, స్మార్ట్ సిటీ పనుల కోసం కేంద్రం కేటాయించిన నిధులు కూడా దుర్వినియోగం చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత కార్యక్రమాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయక విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో నిధులు మురిగిపోతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు ఆర్థిక విధానాలతో ఖజానా ఖాళీ అవడంతో మద్యం అమ్మకాల టెండర్లను కూడా ముందస్తుగా అప్లికేషన్లు టెండర్ల విధానం తీసుకొచ్చి నిధులు సమకూర్చుకోవడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలపై కేంద్ర ప్రభుత్వ శాఖపరమైన సమీక్షలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఇవి ఇంకా కొనసాగుతాయని తెలిపారు. ఆయన వెంట విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత జి.మనోహర్ రెడ్డి ఉన్నారు.

అర్హులు ఓటు కలిగి ఉండాలి

అల్వాల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండాలని అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అల్వాల్ సర్కిల్ ఆధ్వర్యంలో రామ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ స్వామి, బీఎల్‌ఓలు, జ్యోతి, రాపార్తి, బాలు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో ఓటరు నమోదులో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీ శ్రీనివాస్‌రెడ్డి

చెట్ల కొమ్మలు కొట్టేసారు.. రోడ్డు పక్కన పడేశారు..



ఉప్పల్ గణేష్‌నగర్‌లో కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు

ఉప్పల్: విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డొస్తున్నాయనే సమాచారంతో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో 15 రోజులుగా విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలు కట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. నరికేసిన చెట్ల కొమ్మలను గుట్టలుగా రోడ్లపై ఇష్టానుసారంగా పడేయడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నరికేసిన చెట్ల కొమ్మలను సదరు కాంట్రాక్టరే తొలగించాలి. కానీ అలా కాకుండా రోడ్డుకు అడ్డంగా పడేసి నిర్లక్ష్యం వదిలేస్తున్నారు. నరికేసిన చెట్ల కొమ్మలను తొలగించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులదే అయినా సరైన పర్యవేక్షణ లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనె నరికిన చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

పీర్జాదిగూడ నగరాన్ని అగ్రస్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమీక్షలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్ 2023 సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేపై మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో ఇప్పటి వరకు ఎంతమంది ఈ ఫీడ్ బ్యాక్ సర్వేలో పాల్గొన్నారు. ఏ అంశాల పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు.. మౌలిక సదుపాయాల కల్పన ఆవశ్యకత తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రజలు స్వచ్ఛ సర్వేక్షణ సర్వేలో స్వచ్ఛందంగా పాల్గొంటూ.. దేశంలోనే స్వచ్ఛ నగరాల జాబితాలో పీర్జాదిగూడ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తుండటం పట్ల మేయర్ హర్షం వ్యక్తం చేశారు. సర్వే ముగింపునకు కొద్ది రోజులే మిగిలి ఉండటంతో నగరంలోని ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొనే విధంగా కార్యచరణ రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు నమోదు, సవరణ చేసుకోవడం తదితర అంశాల పట్ల అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ జ్యోతి, ఏఈ భిక్షపతి, బిల్ కలెక్టర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.